సాక్షి
కామారెడ్డి
శనివారం । 16 । సెప్టెంబర్ । 2023





## చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్

కామారెడ్డిలో చెడ్డిగ్యాంగ్ హల్‌చల్ చేసింది. దొంగల ముఠా సంచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- IVలో ▸



## కొనసాగుతున్న సమ్మె

తమ డిమాండ్లు నెరవేర్చాలని అంగన్‌వాడీ టీచర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. కళ్లకు గంతలతో నిరసన తెలిపారు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం
29.8 /23.2

## వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం ఎండ కాస్తుంది. మధ్యాహ్నం మేఘావృతమై అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

# పేదలకు చేరువలో వైద్య విద్య

- ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుతో అవకాశం
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ ర్యాలీ, కృతజ్ఞత సభ



సీఎం ప్రసంగాన్ని స్క్రీన్‌పై తిలకిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, విప్ గోవర్ధన్, ఎమ్మెల్యే సురేందర్, కలెక్టర్ పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

**సాక్షి, కామారెడ్డి /కామారెడ్డి టౌన్:** పోరాడి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ దేశంలోనే అగ్రగామిగా నిలిపారని, పేద విద్యార్థులు వైద్య విద్య అభ్యసించడానికి జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కామారెడ్డిలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీని శుక్రవారం సీఎం కేసీఆర్ వర్చువల్‌గా ప్రారంభించారు. కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన స్క్రీన్ ద్వారా సీఎం ప్రసంగాన్ని స్పీకర్‌తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు తిలకించారు. అనంతరం నిజాంసాగర్ చౌరస్తా నుంచి రైల్వే బ్రిడ్జి, పోలీస్ స్టేషన్ రోడ్డు, ప్రభుత్వ ఆస్పత్రి మీదుగా సుభాష్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో పలువురు నేతలు ప్రసంగించారు. స్పీకర్ పోచారం మాట్లాడుతూ... మెడిసిన్ చదవాలంటే ఖర్చుతో కూడుకున్నదని, సీఎం కేసీఆర్ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలతో పేద విద్యార్థులకు ఉచితంగా చదువుకునే అవకాశం దక్కిందన్నారు. మెడిసిన్ చదివే ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ.50 లక్షలు ఖర్చు చేస్తుందన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఏటా పదివేల మంది డాక్టర్లు తయారవుతారని పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు కూడా ఉండేవి కావన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం చొరవతో రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలు ఎంతో మెరుగయ్యాయన్నారు. హైదరాబాద్ నగరానికి నలుమూలల పెద్ద పెద్ద ఆస్పత్రులు నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడంతో ఆయా పట్టణాల్లో పెద్ద ఆస్పత్రులు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కిడ్నీ, లివర్ మార్పిడీలు కూడా జరుగుతున్నాయని తెలిపారు. కామారెడ్డిలో మెడికల్ కాలేజీ ఏర్పాటుతో 330 పడకల ఆస్పత్రి వచ్చిందని, వైద్యంలో ఎంతో అవగాహన ఉన్న ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతో మెరుగైన వైద్య సేవలందుతాయన్నారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. కామారెడ్డిని జిల్లాగా ఏర్పాటు చేయడం, వైద్య కళాశాల ఏర్పాటు చేసిన సీఎంకు కామారెడ్డి ప్రజలు రుణపడి ఉంటారన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్ సింధే మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలో అగ్రగామిగా నిలిపారన్నారు. సభలో ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదర్ శోభ, వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, గ్రంథాలయ చైర్మన్ పున్న రాజేశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి, వైస్‌చైర్‌పర్సన్ ఇందూప్రియ, బీఆర్‌ఎస్ నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మార్కెట్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

### అట్టహాసంగా ప్రారంభోత్సవం

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. స్పీకర్ పోచారం, విప్ గోవర్ధన్, ఎమ్మెల్యేలు సురేందర్, సింధేతో పాటు కలెక్టర్ పాటిల్, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ శోభ, మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### వైద్య రంగంలో ఎన్నో అవకాశాలు



**కామారెడ్డి టౌన్:** వైద్య రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, మెడికల్ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆకాంక్షించారు. శుక్రవారం మెడికల్ కళాశాలను వర్చువల్‌గా సీఎం ప్రారంభించిన అనంతరం కళాశాల హాల్‌లో విద్యార్థులకు అధికారులు స్వాగతం పలికారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడ విద్య అభ్యసించడానికి చక్కటి వాతావరణం కల్పించామన్నారు. ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే మీరు వైద్యులుగా మారి ప్రజలకు వైద్య సేవలు అందించడం గొప్ప వరమన్నారు. ఈ నెల 21 నుంచి క్లాసులు ప్రారంభం అవుతాయని ప్రిన్సిపాల్ పెరుగు వెంకటేశ్వర్లు తెలిపారు.

### మొదట కామారెడ్డిలోనే..

వర్చువల్ ద్వారా వైద్య కళాశాలలను ప్రారంభించే సమయంలో సీఎం కేసీఆర్ మొదట కామారెడ్డి జిల్లాతోనే మొదలు పెట్టారు. కామారెడ్డిలో పాల్గొన్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేల పేర్లను ప్రస్తావించారు.



కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం, పక్కన విప్, ఎమ్మెల్యేలు



సభలో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు



ర్యాలీలో నృత్యం చేస్తున్న మహిళలు

## న్యూస్‌రీల్

### 25న కోనాపూర్‌కు కేటీఆర్ రాక



**బీబీపేట:** మండలంలోని కోనాపూర్‌కు ఈ నెల 25న మంత్రి కేటీఆర్ రానున్నట్లు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తెలిపారు. తన నాయినమ్మ గ్రామం అయిన కోనాపూర్‌లో నిర్మించిన పాఠశాల భవనంతో పాటు పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పరిశీలించారు. కేటీఆర్ సభ ప్రాంగణం, భోజనం ఏర్పాట్లు, పా ర్కింగ్ స్థలాలను చూశారు. జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలమణి, సర్పంచ్ నర్సవ్వ, ఉపసర్పంచ్ స్వామి తదితరులు ఉన్నారు.

### మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలి



**కామారెడ్డి టౌన్:** మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎస్ఎన్ శ్రీదేవి అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజ్ గోపాల్‌గౌడ్, న్యాయవాదులు శ్రీధర్, ప్రతాప్ పాల్గొన్నారు.

### నకిలీ ధ్రువపత్రాలు సమర్పిస్తే చర్యలు

**కామారెడ్డి టౌన్:** పదోన్నతులు, బదిలీలకు సంబంధించి ఉపాధ్యాయులు నకిలీ వైద్య ధ్రువీకరణ పత్రాలను సమర్పిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో ఎస్ రాజు ఒక ప్రకటనలో హెచ్చరించారు. స్పౌస్ పాయింట్లు వినియోగించుకునే దంపతులు వారు పని చేస్తున్న పాఠశాలలకు దగ్గరగా ఉన్న ఖాళీలను మాత్రమే ప్రాధాన్యత క్రమంలో ముందు కోరుకోవాలని, దగ్గర స్థానం వదిలీ దూరంగా ఉన్న పాఠశాలలను కోరుకున్నట్లయితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో 'అల్పాహార పథకం'

**కామారెడ్డి టౌన్:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహార పథకం అమలు చేయనున్నారు. దసరా కానుకగా ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు శుక్రవారం ప్రకటించారు. అక్టోబర్ 24న ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఉదయం నాణ్యమైన పోషకాహారం అందించనున్నారు. దీంతో జిల్లాలో 1,011 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 93,542 మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందనుంది.

### ఈ-పాస్‌తోనే యూరియా విక్రయించాలి



**తాడ్వాయి:** మండలంలోని దేమికలాన్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని శుక్రవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. సొసైటీలో అమ్మిన యూరియా వివరాలను తెలుసుకున్నారు. గ్రౌండ్ స్టాక్, ఈ పాస్ మిషన్‌లో చూపిస్తున్న స్టాక్ వివరాలు చూసి తేడాలను గమనించారు. తేడాను రెండు రోజుల్లో క్లియర్ చేయాలని సీఈవోను ఆదేశించారు. యూరియా అమ్మకాలు తప్పనిసరిగా ఈ-పాస్ మిషన్‌ల ద్వారా జరగాలని సూచించారు. లేదంటే చర్యలు తప్పవన్నారు. అనంతరం గ్రామంలోని ప్రైవేటు ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేశారు. జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ ఉన్నారు.

### తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

**నాగిరెడ్డిపేట:** నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయాన్ని శుక్రవారం ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ తనిఖీ చేశారు. బీఎల్‌వోల విధుల నిర్వహణ తీరును తహసీల్దార్ మహేందర్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల వివరాలపై ఆరా తీశారు.

## ప్రశాంతంగా టెట్ పరీక్ష

- 8671 మంది అభ్యర్థుల హాజరు



ఆర్కే కాలేజీ పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల సందడి



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ పాటిల్

**కామారెడ్డి టౌన్:** ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) శుక్రవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో మొత్తం 9,740 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 8,671 మంది పరీక్షకు హాజరయ్యారు. 1069 అభ్యర్థులు గైర్హాజరయ్యారు. నిమిషం నిబంధన ఉండటంతో పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు గంట ముందే చేరుకున్నారు. కొందరు చివరి క్షణంలో పరుగులు తీసుకుంటూ లోనికి వెళ్లారు. కామారెడ్డిలో ఉదయం 24 కేంద్రాల్లో జరిగిన పేపర్-1 పరీక్షకు 5,535 మంది అభ్యర్థులకు 4,700 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 19 కేంద్రాల్లో జరిగిన పేపర్-2 పరీక్షకు 4,205 అభ్యర్థులకు 3,971 మంది పరీక్ష రాశారు. పట్టణంలోని ఆర్కే కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తనిఖీ చేశారు. ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, ఆదర్శ పాఠశాలల అదనపు సంచాలకులు, రాష్ట్ర పరిశీలకులు సరోజినీ దేవి, డీఈఓ రాజు, పరీక్షల సహాయ సంచాలకులు నీలం లింగం కేంద్రాలను తనిఖీ చేశారు.

### ట్రాఫిక్ తిప్పలు

మెడికల్ కళాశాల ప్రారంభోత్సవం, అలాగే బీఆర్‌ఎస్ ర్యాలీ ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పరీక్షా కేంద్రాల వద్ద సైతం ట్రాఫిక్ సమస్యతో వాహనాలు చాలా సమయం వరకు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పేపర్-2 పరీక్షా సమయానికి రైల్వే బ్రిడ్జి, నిజాంసాగర్ రోడ్‌లో పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ సమస్యలతో అభ్యర్థులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. 144 సెక్షన్ అమలులో ఉన్నా.. కేంద్రాల వద్ద ర్యాలీలు, డీజే సౌండ్‌లు ఉండటంతో అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు.

## నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

- ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

**కామారెడ్డి క్రైం:** నేరాలను నియంత్రించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. డీపీవోలో శుక్రవారం నిర్వహించిన నెలవారీ సమీక్షలో ఆయన మాట్లాడారు. కులమతాలకు అతీతంగా పండుగలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నియామవళిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల వివరాలను తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను పరిశీలించారు. నేరాలను తగ్గించడానికి బీట్, పెట్రోలింగ్‌లను పెంచాలని, నేరాలు జరుగుతున్న తీరుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రంలోని 30 ఉత్తమ పోలీస్ స్టేషన్లలో కామారెడ్డి జిల్లాకు చెందిన పట్టణ, దేవునిపల్లి, నస్రుల్లాబాద్, బిచ్కుంద పోలీస్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో ఎస్పీ నర్సింహారెడ్డి, డీఎస్పీలు ఆర్ ప్రకాశ్, శ్రీనివాస్, జగన్నాథ్ రెడ్డి, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

## మెడి'కల' తీరింది!

- కామారెడ్డిలో వైద్య కళాశాల ప్రారంభం
- స్థానిక విద్యార్థులకూ దక్కిన సీట్లు
- మొదలు కానున్న తరగతులు



కామారెడ్డి మెడికల్ కాలేజీలో చేరిన వైద్య విద్యార్థులతో అధ్యాపకులు

**సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్:** జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల ఏర్పాటు కావాలన్న జిల్లా ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్ వర్చువల్‌గా వైద్య కళాశాలను ప్రారంభించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలంలో నిర్మించిన మాతా, శిశు సంరక్షణ ఆస్పత్రి భవనంలో వైద్య కళాశాల నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. సొంత భవనం నిర్మాణానికి నిధులు మంజూరై టెండర్ల దశలో ఉన్నాయి. కాగా జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు కావడంతో జిల్లాకు చెందిన విద్యార్థులతో పాటు చుట్టుపక్కల జిల్లాల విద్యార్థులకు ఎంతో అనుకూలంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కామారెడ్డి పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాలకు చెందిన దాదాపు పది మంది విద్యార్థులు కాలేజీలో జాయిన్ అయ్యారు. నీట్‌లో సాధించిన ర్యాంకుల ఆధారంగా సీట్లు కేటాయించారు. ఫస్టియర్‌లో వంద సీట్లు ఉండగా 85 సీట్లు రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు, 15 సీట్లు ఆల్ ఇండియా కోటాలో ఇతర రాష్ట్రాలకూ కేటాయిస్తారు. మొదటి విడతలో 85 సీట్లకు గాను 80 మంది ఇప్పటికే ప్రవేశం పొందారు. ఆల్ ఇండియా కోటాలో 15 సీట్లకు పది మంది జాయిన్ అయ్యారు. మాప్ అప్ రౌండ్‌లో మిగతా పది సీట్లు భర్తీ అవుతాయని భావిస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు విద్యార్థులకు సీట్లు లభించాయి. దీంతో వైద్య విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బంది తప్పిందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చుట్టు పక్కల జిల్లాలకు చెందిన పలువురు విద్యార్థులు జాయిన్ అయ్యారు.

### ఈ నెల 21 నుంచి తరగతులు..

కాలేజీ ప్రారంభించిన నేపథ్యంలో ఈ నెల 21 నుంచి తరగతులు ప్రారంభించనున్నారు. ఇప్పటికే ప్రొఫెసర్లు విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. కాలేజీలో అనాటమీ, బయోకెమిస్ట్రీ, ప్రివెంటివ్ మెడిసిన్‌పై ప్రథమ సంవత్సరం పాఠ్యాంశాలుగా బోధించనున్నారు. తెల్లకోటు ధరించిన విద్యార్థులంతా కాలేజీలో అడుగుపెట్టారు. సీఎం ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. అంతకుముందు కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావ్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.

### విద్యార్థులు, తల్లిదండ్రులతో ఇంటరాక్షన్

మెడికల్ కాలేజీ ప్రారంభమైన తర్వాత శుక్రవారం ఉదయం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో ప్రొఫెసర్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఇంటరాక్ట్ అయ్యారు. కాలేజీలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని కాలేజీకి వన్నె తేవాలని ప్రొఫెసర్లు సూచించారు.

### సంతోషంగా ఉంది



నాకు సొంత జిల్లాలోని వైద్య కళాశాలలో సీటు రావడం అదృష్టంగా భావిస్తున్నా. చాలా సంతోషంగా ఉంది. కామారెడ్డిలోనే కావాలని కౌన్సెలింగ్‌లో మొదటి ఆప్షన్ ఇక్కడే ఎంచుకున్నా. న్యూరో సర్జన్ కావాలన్నది నా లక్ష్యం. కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తుండటంతో ఇంకా అభివృద్ధి అవుతుందని భావిస్తున్నా. - నక్క జ్ఞానేశ్వర్, బాన్సువాడ

### సొంత జిల్లాలో..



సొంత జిల్లాలో వైద్య కళాశాలలో నాకు ఎంబీబీఎస్ సీటు రావడం సంతోషంగా ఉంది. మొదట్లో ఇక్కడ సీటు రాదేమోనని భయపడ్డా. ఇక కష్టపడి ఎంబీబీఎస్ పూర్తి చేస్తా. కళాశాల భవనం, ఇతర సౌకర్యాలు అన్ని బాగున్నాయి. - చందన జాదవ్, కామారెడ్డి

## జీపీలు పోటీతత్వంతో పని చేయాలి

**కామారెడ్డి క్రైం:** రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డులు పొందడానికి జిల్లాలోని గ్రామ పంచాయతీలు పోటీతత్వం అలవర్చుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ (2023) జిల్లా స్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన తొమ్మిది జీపీలకు అవార్డులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇంకుడుగుంతలు, పచ్చదనం, పరిశుభ్రత లాంటి కార్యక్రమాలు 100 శాతం అమలు చేయాలన్నారు. రెండు వేల లోపు జనాభా ఉన్న జీపీలను మొదటి కేటగిరిలో, 2001 నుంచి 5000 వరకు జనాభా గల జీపీలను రెండో కేటగిరీ, ఐదు వేలకు పైగా జనాభా ఉన్న జీపీలను మూడో కేటగిరీగా అవార్డులు ఎంపికకు ప్రభుత్వం గుర్తిస్తుందని తెలిపారు. డీఆర్‌డీవో సాయన్న, డీపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అవార్డులు అందజేస్తున్న అదనపు కలెక్టర్

### జిల్లా స్థాయి అవార్డులు పొందిన జీపీలు

శివాయిపల్లి, బస్వాపూర్, పెద్దమల్లారెడ్డి, వాజిద్‌నగర్, బీర్కూర్, అంబారిపేట, దోమకొండ, గర్గుల్, రత్నగిరిపల్లి.

## క్లుప్తంగా

### అస్సాం సీఎంను కలిసిన దినేశ్‌కుమార్



డిచ్‌పల్లి: అస్సాం సీఎం హేమంత బిశ్వశర్మను బీజేపీ రూరల్ ఇన్‌చార్జి కులాచారి దినేశ్‌కుమార్, డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. వారి వెంట పార్టీ నాయకులు శ్రావణ్, రాంగోపాల్ వినోద్‌రెడ్డి ఉన్నారు.

### ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

బాల్కొండ: ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 18968 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి వరద కాలువ ద్వారా 15 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 3 వేలు, లక్ష్మి కాలువ ద్వారా 150, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(90టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి అదేస్థాయిలో నిల్వ ఉంది.

### మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



నిజామాబాద్‌నాగారం: మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు మెప్మా సహాయ సహకారాలు అందిస్తుందని మెప్మా పీడీ రాజేందర్ అన్నారు. నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు మెప్మా సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. వ్యాపార సంస్థలు నెలకొల్పేందుకు కావాల్సిన శిక్షణ, రుణ సౌకర్యం, పరిశ్రమ స్థాపనకు అవసరమైన యంత్రాలు, మార్కెటింగ్ సౌకర్యం, ఇతర నైపుణ్యాలు మెప్మా ద్వారా అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ టౌన్ ప్రాజెక్ట్ అధికారి రమేశ్, మెప్మా అధికారి మాధురి, పీఆర్పీ శోభ, తరుణ్, విక్రాంత్ పాల్గొన్నారు.

### 19వ రోజుకు చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె



కామారెడ్డి టౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 19వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మె శిబిరంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సత్యనారాయణ, శైలజ, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ అస్తవ్యస్తం

- అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్
- ఇబ్బందుల్లో నగర ప్రజలు



బస్టాండ్ ఎదుట రోడ్డుపై నిలిచిన ఆటోలు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రయాణించాలంటేనే వాహనాదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలోని వ్యాపార కేంద్రాలు, ఆసుపత్రులు, రైల్వేస్టేషన్, బస్టాండ్ దగ్గర పగలూ రాత్రి అనే తేడా లేకుండా వాహనాలు కిటకిటలాడుతాయి. ఆసుపత్రుల్లు, వ్యాపార కేంద్రాలు, రైల్వేస్టేషన్, కోర్టు చౌరస్తా వద్ద వాహనా లను ఇష్టారీతిన నిలపడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. అంతేకాకుండా రోడ్లపై తోపుడు బండ్ల నిర్వాహకులు సైతం ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తుండడంతో సమస్య మరింత ఎక్కువవుతోంది. దీంతో నగరంలో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా వాహనాలు సైతం విపరీతంగా పెరుగుతున్నాయి.

### ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

నగరంలో గాంధీచౌక్, బస్టాండ్, మెడికల్ కాలేజీ, బస్టాండ్, జీజీహెచ్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్, పాలిటెక్నిక్ కాలేజీ, ఆర్యనగర్, శివాజీనగర్, దేవీటాకీస్, తిలక్‌గార్డెన్, మున్సిపల్ కాంప్లెక్స్‌లలో ఉన్న ఫుట్‌పాత్‌లను చిరు వ్యాపారులు ఆక్రమిస్తూ వ్యాపారం కొనసాగిస్తున్నారు. దీంతో పాదచారులు ఫుట్‌పాత్‌లపై వెళ్లడానికి అవకాశం లేకుండా పోతోంది.

ఉంటుంది. ఇక్కడ వ్యాపార కేంద్రాలు ఎక్కువగా ఉండడంతో దుకాణాలకు వచ్చే కొనుగోలు దారులు తమ వాహనాలను రోడ్డుపై ఉంచడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నా అధికార యంత్రాంగానికి చీమకుట్టినట్లు కూడా లేదు.

### ఇరుకు ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులు

నగరంలోని పూసలగల్లీతోపాటు దేవీరోడ్డు, బోధన్ చౌరస్తా, కిసాన్‌గంజ్, పిక్చర్ ప్యాలెస్ ప్రాంతాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య అధికంగా

### ఆటోలతో ఇబ్బందులు

నగరంలో ఎక్కువగా ఆటోలతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. జిల్లాలో సుమారు 28 వేల ఆటోలు నిత్యం ప్రయాణిస్తుంటాయి. నగరంలోని బస్టాండ్, జీజీహెచ్, రైల్వేస్టేషన్ తోపాటు గాంధీచౌక్ ప్రాంతాల్లో ఆటోలను రోడ్లపైనే ఉంచుతారు. బస్టాండ్ వద్ద ఆటోలను రోడ్డుపై నిలిపి ఉంచడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోలను నియంత్రించి ట్రాఫిక్ లేకుండా ఉండాలని వాహనాదారులు కోరుతున్నారు.

### హాస్పిటళ్లకు సెల్లార్లు లేకపోవడంతో..

నగరంలోని ఖలీల్‌వాడిలో ఆసుపత్రులు ఎక్కువగా ఉంటాయి. ఇక్కడ ఆసుపత్రులకు సెల్లార్లు సక్రమంగా లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలు నిలుపుతుండడంతో ద్విచక్ర వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో వన్‌వే ఏర్పాటు చేసి ఇటీవల తీసేశారు. ఖలీల్‌వాడిలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సెల్లార్లు లేని హాస్పిటళ్లకు అనుమతుల ఇవ్వడంపై మున్సిపల్ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రగతినగర్‌లో సైతం కొత్తగా ప్రారంభమైన హాస్పిటళ్లల్లో సైతం సెల్లార్లు లేకపోవడంతో వాహానాదారులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య అధికంగా నెలకొంటోంది. ఇకనైనా ఉన్నత అధికారులు ట్రాఫిక్ సమస్యపై స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### రాంగ్‌రూట్‌లో ప్రయాణాలు

నగరంలో తీవ్ర ట్రాఫిక్ సమస్యలతో పాటు రాంగ్‌రూట్ ప్రయాణాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీని మూలంగా రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న వాహనాలను ప్రమాదాలకు గురవుతున్నాయి. స్పందించిన పోలీసులు నాటి నుంచి రాంగ్‌రూట్ వచ్చే వాహనాలపై జరిమానా విధించి కేసు నమోదు చేస్తున్నారు. నగరంలోని ప్రధానంగా దేవీటాకీస్, వినాయక్‌నగర్ హనుమాన్ మందిరం, బోధన్‌రోడ్డు, ఖిల్లా చౌరస్తా, ఆటోనగర్, కంఠేశ్వర్, పులాంగ్, శివాజీనగర్ చౌరస్తా, రైల్వేస్టేషన్, బస్టాండ్, ఎల్లమ్మగుట్ట చౌరస్తా, ఖలీల్‌వాడి ప్రాంతాల్లో రాంగ్‌రూట్‌లలో ప్రయాణాలు కొనసాగుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.



రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉంచిన వాహనాలు

# మెడికల తీరింది!

కామారెడ్డిలో మెడికల్ కళాశాల ఏర్పాటుపై జిల్లా విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కళాశాలలో జిల్లా విద్యార్థులు పలువురు సీట్లు సాధించారు. వారు తమ అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్

### ఉన్న టౌన్‌లోనే..



మేము కామారెడ్డి పట్టణంలోనే ఉంటాం. నేను ఉంటున్న చోటే మెడికల్ కాలేజీలో చదువుకోవడం ఆనందంగా ఉంది. డాక్టర్ కావాలన్నదే చిన్ననాటి నుంచి నా లక్ష్యం. నేను నివసించే చోట డాక్టర్ చదువుతానని కలలో కూడా అనుకోలేదు. – శ్వేతశ్రీ, కామారెడ్డి

### మొదటి కౌన్సెలింగ్‌లోనే..



మాది దోమకొండ, మానాన్న కామారెడ్డిలో ప్రభుత్వ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తారు. నాకు మొదటి కౌన్సెలింగ్‌లోనే కామారెడ్డిలో వచ్చింది. ఇక వేరే ఆప్షన్‌లకు వెళ్లలేదు. మేము ఉండేది కామారెడ్డి పట్టణంలోనే. ఇక్కడే సీటు రావడం చాలా సంతోషంగా ఉంది.

– మేకల సుదీప్, దోమకొండ

### కొత్త కాలేజీ బాగుంటుందని..



కొత్త కాలేజీ బాగుంటుందని కామారెడ్డి మెడికల్ కళాశాలలో సీటు కోసం ఆప్షన్ పెట్టుకున్నా. అనుకున్నట్లు ఇక్కడే రావడం సంతోషంగా ఉంది. మాది నిజామాబాద్ నగరం కావడంతో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ప్రజలకు వైద్య సేవలందించడమే నా లక్ష్యం.

– బేహరి దీనా, నిజామాబాద్

### అమ్మానాన్నల కల నెరవేరుస్తా



మాది వ్యవసాయ కుటుంబం. నేను డాక్టర్ అవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నా. నా కల నెరవేరబోతుంది. ఇప్పుడే డాక్టర్ అయినంతగా ఆనందంగా ఉంది. ఎంబీబీఎస్ పూర్తి చేసి, అమ్మనాన్నల కల నెరవేరుస్తా.

– గాండ్ల వినయ్‌కుమార్, వేల్పూర్

### కావాలని ఆప్షన్ పెట్టుకున్నా



కామారెడ్డి మెడికల్ కళాశాలలోనే సీటు కావాలని ఆప్షన్ పెట్టుకున్నా. అనుకున్నట్లు కామారెడ్డిలోనే వచ్చింది. నూతన కళాశాల కాబట్టి అన్ని సౌకర్యాలు కల్పిస్తు న్నారు. డాక్టర్ అవ్వాలనే నా కల తీరనుంది. మాది రైతు కుటుంబం. మా తల్లిదండ్రులు కా మారెడ్డిలో సీటు వచ్చిందనగానే సంతోషపడ్డారు. – సాయినాథ్, నిర్మల్

# జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పల్లెబోగుడ తండాలో శుక్రవారం స్థానిక సర్పంచ్ బద్దీబాయ్‌తో కలిసి జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్ రెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండాలో పంచాయతీ భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే సురేందర్ రూ.20 లక్షల నిధులను మంజూరు చేశారన్నారు. పనులను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

# అధిక యూరియాతో ఎండాకు తెగులు



బొప్పాపూర్‌లో పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రుద్రూర్/వర్ని: అధిక యూరియాతో వరి పంటలో ఎండాకు తెగులు సోకుతున్నట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు తెలిపారు. రుద్రూర్, కోటగిరి, వర్ని, చందూర్, మోస్రా మండలాల్లోని పలు గ్రామాల్లో రాజేంద్రనగర్ వరి పరిశోధన స్థానం, రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు శుక్రవారం పర్యటించి పంటలను పరిశీలించారు. తెగులు నివారణకు సమగ్ర ఎరువుల యాజమాన్యంతో పాటు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. శాస్త్రవేత్తలు రామ్‌గోపాల్‌వర్మ, చంద్రమోహన్, కిరణ్ బాబు, కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ టి. అంజయ్య, విజయ్ కుమార్, రాజ్‌కుమార్, కోటగిరి వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు, రుద్రూర్ జడ్పీటీసీ నరోజి గంగారాం, భవానిపేట్ సర్పంచ్ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

# అమరుల చరిత్రను పాఠ్యాంశాలుగా చేర్చాలి

- బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి



ర్యాలీని ప్రారంభిస్తున్న వెంకట రమణారెడ్డి



బీజేపీ నేత రమణారెడ్డిని సన్మానిస్తున్న కుల సంఘాల నేతలు

కామారెడ్డి టౌన్: తెలంగాణ కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరుల చరిత్రను పాఠశాల స్థాయిలో పాఠ్యాంశాలుగా చేర్చాలని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. స్వరాష్ట్రంలో కూడా తెలంగాణ అమరుల గురించి తెలియకపోవడం విచారకరమన్నారు. నాడు నిజాం నవాబులు, రజాకార్లకు ఎదురొడ్డి పోరాడిన సాయుధపోరాట యోధులు చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య లాంటి వారి చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని, అంతే కాకుండా తెలంగాణ తొలి ఉద్యమం 1969లో పాల్గొన్న వారి గురించి, మలి దశ తెలంగాణ ఉద్యమకాలంలో తెలంగాణ కోసం అమరులైన వారి చరిత్రను సైతం పాఠ్యాంశాలుగా చేర్చాలనీ డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం రాగానే పాఠ్యాంశాలుగా చేర్చుతామని అన్నారు.

### సంఘ భవనాల అభివృద్ధికి నిధులు అందిస్తాం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి మున్నూరు కాపు, కురుమ సంఘ భవనాల అభివృద్ధికి నిధులు అందిస్తామని బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణా రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రమణారెడ్డిని మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షుడు కాసర్ల రాజలింగం, కోశాధికారి ద్యావరి శ్రీనివాస్, తదితరుల ఆధ్వర్యంలో సన్మానించారు.

# తపాలశాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న అధికారులు

ఎడపల్లి(బోధన్): ప్రతి ఒక్కరూ తపాలశాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజనర్సాగౌడ్ అన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం తపాల శాఖ, భారత ప్రభుత్వం గ్రామీణ తపాల జీవిత బీమా సంయుక్త ఆధ్వర్యంలో అధికారులు పథకాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. గ్రామీణ తపాలా జీవిత బీమాలో సభ్యత్వం తీసుకున్న వారికే ఈ అవకాశం ఉంటుందన్నారు. రూ. 500 చెల్లించి ఖాతాను ప్రారంభం చేసుకోవాలన్నారు. అనంతరం పలువురికి ప్రమాద బీమా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోతీసింగ్, ఎంపీడీవో గోపాలకృష్ణ, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయండి



ధర్నాలో మాట్లాడుతున్న రాజమల్లు

కామారెడ్డి టౌన్: మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగం రాజమల్లు మాట్లాడారు. కార్మికుల స మస్యలు పరిష్కరించాలన్నారు. ఏపీ తరహాలో కనీ స వేతనం రూ. 21 వేలు చెల్లించాలన్నారు. అనంత రం కమిషనర్ దేవేందర్‌కు వినతిపత్రం అందజేశా రు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఖలీల్, రాష్ట్ర కా ర్యదర్శి రాజనర్సు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఉత్తమ ప్రతిభ చూపి న ఆరుగురు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) సంస్థ నుంచి రూ.2,500 చొప్పున స్కాలర్‌షిప్ పంపి ణీ చేస్తున్నామని కెనెరా బ్యాంక్ మేనేజర్ శ్రావ ణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం వడ్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెనెరా బ్యాంక్ మే నేజర్, స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడారు. కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ మేనేజర్ ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# ఓటరు నమోదును ప్రోత్సహించే వీడియోలు చేయాలి

కామారెడ్డి క్రైం : ప్రజల్లో ఓటరు నమోదును ప్రోత్సహించడానికి పోస్టర్లు, చిన్న నిడివి గల వీడియోలను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం తెలిపారు. చిహ్నాలు, రంగులు, నాయకులు మొదలైన రాజకీయ అర్థాలతో కూడిన ఎంట్రీలు పరిగణలోకి తీసుకోరన్నారు. ఏ భాషలోనైనా పోస్టర్, వీడియో రూపొందించి పంపవచ్చన్నారు. ఆసక్తి గల వారు 23లోగా తమ ఎంట్రీలను వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు.



## క్రైం కార్నర్

# అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి



అరుణ (ఫైల్)

కామారెడ్డి క్రైం: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన శ్రీగాధ అరుణ(35) అనుమానస్పదస్థితిలో మృతి చెందినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అరుణ బీడీలు చుడుతూ జీవనం సాగించేది. తల్లి సావిత్రితో కలిసి ఓ ఇంట్లో అద్దెకు ఉండేది. ఈనెల 4న ఇంటి నుంచి వెళ్లిన అరుణ తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇండ్లల్లో వెతికినా లభించలేదు. నర్సన్నపల్లిలో ఖాళీగా ఉన్న డబుల్ రూం ఇంట్లో కుళ్లిపోయిన మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పోలీసులు మృతురాలిని అరుణగా గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానస్పదస్థితి మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### చికిత్స పొందుతూ ఒకరు..



బుచ్చన్న (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మోపాల్‌కు చెందిన కెంపు బుచ్చన్న (42) పాము కాటుకు గురికాగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. బుచ్చన్న వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూవారీలాగే ఈనెల 12న పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా పాముకాటు వేసింది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### కంఠేశ్వర్‌లో వివాహిత..

ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్‌కు చెందిన ఎలిగేటి మానస (37) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రూరల్‌మండలంలోని గుండారం గ్రామానికి చెందిన మానస, కంఠేశ్వర్‌కు చెందిన యాదగిరితో 2006లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆగస్టు 28న యాదగిరి మద్యం సేవించి మానసను కొట్టాడు. దీంతో బాధతో మానస పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబీకులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మానస సోదరుడు సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఇద్దరి నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి: బైకులను చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని ఆర్యనగర్‌కు చెందిన మంతెన నరేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దుబ్బకు చెందిన గైనికొండ సురేశ్, మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన కోడెం ఆనంద్ పాత నేరస్తులని, దొంగతనం కేసులో ఇద్దరు జైలు జీవితం అనుభవించినట్లు చెప్పారు. జైలులో పరిచయమైన ఇద్దరు జల్సాలకు అలవాటు పడి ఐదు బైక్‌లను దొంగతనం చేసినట్లు తెలిపారు. ఓ బైక్‌ను బోధన్‌లో అమ్మడానికి వెళ్తుండగా నగరంలోని బోధన్ బస్టాండ్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడినట్లు చెప్పారు. వీరిని విచారించి ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు, ఎస్సై విష్ణుప్రకాశ్ ఉన్నారు.

### బతికున్న కుమార్తెకు దినకర్మ

- ప్రేమించిన వ్యక్తితో వెళ్లిపోయిందని తల్లిదండ్రుల కోపం

ఖలీల్‌వాడి: అల్లారు ముద్దుగా పెంచిన కుమార్తె భర్తతో విడిపోయి ప్రేమించిన వ్యక్తితో వెళ్లిపోయిందనే కోపంతో ఆ తల్లిదండ్రులు గురువారం దశదినకర్మ చేశారు. నగరంలోని ఓ కాలనీకి చెందిన యువతికి తల్లిదండ్రులు వివాహం జరిపించారు. కొన్నాళ్లకు భర్తకు బోన్‌క్యాన్సర్ అని తెలియడంతో తల్లి గారింటికి వచ్చేసింది. దీంతో సద రు యువతి తాను ప్రేమించిన వ్యక్తితో ఇటీవల వెళ్లిపోయింది. దీంతో తమ పరువు తీ సిందంటూ బతికున్న కుమార్తెకు ఆ తల్లిదండ్రు లు దశదినకర్మ చేశారు. ఈ నెల 10న తమ కు మార్తె చనిపోయిందని 14న దినకర్మ పేరుతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాడు. ఇది కాస్త సోషల్‌మీడియాలో వైరల్‌అవుతోంది.

### ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి షేక్ షాహీద్(14) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న షేక్ షాహీద్ మానసికస్థితి బాగా లేదని, కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నట్లు కుటుంబీకులు తెలిపారు. శుక్రవారం భోజనం చేసేందుకు ఇంటికి వచ్చిన షాహీద్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సంక్షిప్తం..

### వర్నిలో బైక్ చోరీ

వర్ని: మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు వద్ద నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం చోరీకి పాల్పడ్డారు. మండలంలోని కోటయ్య క్యాంపు గ్రామానికి చెందిన కంటిపూడి రమేశ్ పనినిమిత్తం బైక్‌పై బ్యాంకుకు వచ్చాడు. బ్యాంకు నుంచి తిరిగి వచ్చేసరికి బైక్‌కనిపించక పోవడంతో సీసీ కెమెరాలో ఇద్దరు నిందితులు చోరీకి పాల్పడినట్లు రికార్డు అయింది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

### ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బంజార తండా వద్ద శుక్రవారం బైక్ అదుపుతప్పి కిందపడడంతో యువకునికి తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన దారబోయిన నాగరాజు తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై గోపాల్‌పేట నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా బంజారతండా వద్ద వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో నాగరాజుకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం 108లో ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### మహిళపై కేసు నమోదు

నిజామాబాద్ రూరల్: విధి నిర్వహణలో మహిళా కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించిన ఓ మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్‌కుమార్‌శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. విద్యుత్‌నగర్‌లో నివాసం ఉంటే ఎస్‌కే సల్మాబేగం శుక్రవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ అనురాధపై దురుసుగా ప్రవర్తించి నెట్టివేసింది. దీంతో హెడ్‌కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు సల్మాబేగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.